# పాండ్రంగి వంతెన నిర్మాణానికి మోక్షం

రూ.16.50 కోట్లతో టెండర్లు ఆహ్వానం



గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న పాండ్రంగి వాసులు

పద్మనాభం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జన్మించిన పాండ్రంగి వాసులకు వర్షాకాలంలో వెతలు తప్పనున్నాయి. ఈ గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలవడంతో దశాబ్దాలు తరబడి పడుతున్న కష్టాలు తీరనున్నాయి. ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు చొరవ తీసుకోవడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పంచాయతీ రాజ్ రూరల్ ఫండ్స్ నుంచి మొదట రూ.14 కోట్లు మంజూరు చేశారు. ఇవి చాలవన్న కారణంతో అప్పట్లో ఎవరూ టెండర్లు వేయడానికి ముందుకు రాలేదు. దీంతో తర్వాత అదనంగా రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. మొత్తం రూ.16.50 కోట్లకు చేరుకుంది. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు ఆగస్టు 5 వరకు టెండర్లు వేసే అవకాశం కల్పించారు. టెండర్లు పిలవడంతో వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. వంతెన నిర్మాణం పూర్తయితే పాండ్రంగి పంచాయతీ ప్రజలతోపాటు మండలంలోని అనంతవరం, గొల్లలపాలెం, పెంట, పాత కొవ్వాడ, కొత్తకొవ్వాడ, గంధవరం గ్రామ ప్రజలు పాండ్రంగి మీదుగా తగరపువలస వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది.

**రోజుల తరబడి జలదిగ్బంధంలో...**

పాండ్రంగి గ్రామం గోస్తనీ నదిని ఆనుకుని ఉంది. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలు ఊరు దాటేందుకు కష్టాలు పడాల్సి వస్తుంది. పలు మార్లు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నారు. గ్రామ సమీపంలోని జంక్షన్‌కు చేరుకుని తగరపువలస, విశాఖపట్నం, విజయనగరం వెళ్లడానికి బస్సులు, ఆటోలు ఎక్కేందుకు కూడా వీలులేని పరిస్థితి. సంగివలస మీదుగా తగరపువలస వెళ్లాలనుకున్నా మధ్యలో గెడ్డలు అడ్డు వస్తాయి. ఆనందపురం మండలం బోని మీదుగా పద్మనాభం రావాలనుకున్నా మద్ది సమీపాన ఉన్న పల్లి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పాండ్రంగి వాసులు ఊరు విడిచి ఎటూ వెళ్లలేని పరిస్థితి. అంతేకాకుండా పాండ్రంగి పంచాయతీ శివారు గ్రామాలైన కురపల్లి, బర్లపేట గ్రామాల ప్రజలు వర్షాకాలంలో పంచాయతీ పరమైన పనులకు పాండ్రంగి వెళ్లలేక ఇబ్బందులు పడుతుంటారు. తప్పని పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసినా ప్రాణాలకు తెగించి నదిలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**నీటి మీద రాతలుగానే గత పాలకుల హామీలు**

ఈ నేపథ్యంలో ఇక్కడి గోస్తనీ నదిపై వంతెన నిర్మిస్తామని గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నీటిపై రాతలుగానే మిగిలాయి. దీంతో ఈ గ్రామ ప్రజలు వర్షాకాలంలో నదిలో దిగి పాండ్రంగి జంక్షన్‌కు చేరుకోవడానికి ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామానికి చెందిన ఆర్.ఎస్.సూర్యనారాయణరాజు ఒకసారి, ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు నాలుగు సార్లు భీమిలి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. అప్పల నరసింహరాజు కొంత కాలం మంత్రిగా కూడా పని చేశారు. అయినప్పటికీ వంతెన నిర్మాణం జరగలేదు. 2014 ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి... ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కూడా అయ్యారు. అయినా వంతెన హామీ మాత్రం నోటి మాటలకే పరిమితమయింది తప్ప కార్యరూపం దాల్చలేదు. తర్వాత కాలంలో గత రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అయినా వంతెన నిర్మాణం జరగలేదు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు పనులపై దృష్టి సారించండి



సాగర్‌నగర్‌లో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కొమ్మాది: రోడ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ, రుషికొండ, మిథిలాపూరి వుడా కాలనీ, రుషికొండ వుడా కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికుల అవసరాలు, రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎండాడ నుంచి రుషికొండ వరకు రోడ్డుకి ఇరువైపులా బడ్డీలతో ఆక్రమించారని, వారికి ప్రత్యామ్నాయం చూపించి వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఎండాడ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, నిర్లక్ష్యం వహించరాదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురవాడ వెళ్లేందుకు వీలుగా ఎమ్‌కే 1 రోడ్‌ను 60 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలని, సాగర్‌నగర్, ఎండాడను అనుసంధానించే రోడ్లతోపాటు వార్డుల్లోని రోడ్లు, కాలువలు, పార్కింగ్ ప్రదేశాలు, సేద తీరేందుకు పార్కులు సరిగా లేవని, వాటిని నిర్మించాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంవోహెచ్ డాక్టర్ ఎమ్.కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు లొడగల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాలిథిన్ కవర్లు సీజ్



మధురవాడలో పాలిథిన్ కవర్లు సీజ్ చేస్తున్న అధికారులు

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని మధురవాడ, కొమ్మాది కూడలి, పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులు గురువారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో బుధ, గురు వారాల్లో 40 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీజ్ చేసినట్టు వారు తెలిపారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులతో మానవాళికి, పర్యావరణానికి ఎంతో ప్రమాదని, అందుకే నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు పి.సందీప్, ఎస్.ఎల్లాజీ, ఎ.నరసింగరావు, ఎమ్.రవి తదితరులు పాల్గొన్నారు.

### 'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ, గండిగుండం పంచాయతీల్లో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో ఆడపా లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఆయన తెలిపారు.

### లయన్స్ సెంటినియల్స్ కార్యవర్గం

భీమునిపట్నం: స్థానిక లయన్స్ క్లబ్ భీమిలి సెంటినియల్స్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎంవీ పార్వతీశం, కార్యదర్శిగా అల్లం రామకృష్ణ, కోశాధికారిగా షమ్మీరుద్దీన్ సయ్యద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పార్వతీశం మాట్లాడుతూ తమకు అందించిన బాధ్యతలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రసాద్, పి.సత్యానందం, దుర్గాప్రసాదరావు, చందన, కోట మల్లికార్జునరావు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మారికవలస విద్యుత్ సబ్‌స్టేషన్ మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కాలనీ, పీపీ – 2 కాలనీ, మారికవలస పెట్రోల్ బంక్ ఏరియా, శారదానగర్, తిమ్మాపురం రోడ్డు, ఓంకార్‌నగర్ అపార్ట్‌మెంట్, వైఎస్సార్ కాలనీ, గాయత్రి హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఆనందపురం : విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం వెల్లంకి, బొడ్డపాలెం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### 'జగనన్న సురక్ష'తో అర్హులకు ధ్రువపత్రాలు

పద్మనాభం: జగనన్న సురక్షతో అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందుతున్నాయని, తద్వారా సంక్షేమ పథకాల లబ్ధి పొందుతారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని గంధవరం, కొవ్వాడ గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంధవరం సర్పంచ్ జీవీకేకే వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# నిలిచిన తాగునీటి సరఫరా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో గురువారం అప్రకటితంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. కుళాయి నీటి కోసం ఎదురు చూసి ఆర్వో ప్లాంట్ల వద్ద తాగునీటి కోసం క్యూ కట్టారు. చాలాచోట్ల బోరుబావులు పని చేయక పోవడంతో వాడుక నీటి కోసం ఇబ్బంది పడ్డారు. కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయలేనప్పుడు వాటర్ ట్యాంకుల ద్వారా అయినా సరఫరా చేసి ఆదుకోవాలని భీమిలి జోనల్ ప్రజలు కోరుతున్నారు.

**పైప్‌లైన్‌ను జేసీబీ తవ్వేయడంతో...**

జీవీఎంసీ 1వ వార్డు బాలాజీనగర్ నుంచి మురుగు నీటిని గోస్తనీ నదిలో పాత వంతెన వద్దకు మళ్లించే డ్రైనేజీ పనులు బుధవారం చేపట్టారు. ఈ డ్రైనేజీ తవ్వే క్రమంలో జాతీయ రహదారిపై రెండు వంతెనలు కింద పైప్‌లైన్‌ను జేసీబీ తవ్వేసింది. దీంతో రెండు రోజులుగా మరమ్మతులు చేస్తున్నా పైప్‌లైన్ పనులు ఓ కొలిక్కి రాకపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది అంటున్నారు. గురువారం సాయంత్రానికి కూడా దీని మరమ్మతులు పూర్తి కాలేదు. దీంతో శుక్రవారం కూడా తాగునీటి సరఫరా ఉండకపోవచ్చని సిబ్బంది సందేహం వ్యక్తం చేస్తున్నారు.

### బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఉత్తమ సేవలు



సమాజీరావ్ గైక్వాడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఆనందపురం : బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి ఉత్తమ సేవలు అందిస్తున్నామని బ్రాంచి మేనేజర్ రామునాయుడు చెప్పారు. వేములవలసలో ఉన్న బ్యాంక్ శాఖ కార్యాలయంలో గురువారం వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా బ్యాంక్ వ్యవస్థాపకుడు సమాజీరావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వారికి సులభంగా సేవలు అందిస్తున్నామన్నారు.

# వ్యవసాయ డ్రోన్ల వినియోగానికి అధికారుల కసరత్తు

ఆనందపురం మండలానికి ఆరు మంజూరు

ఆనందపురం : ఆనందపురం మండలంలో వ్యవసాయ డ్రోన్లు వినియోగించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. కూలీల కొరతతో రైతులు సకాలంలో ఎరువులు, పురుగు మందులు పొలాల్లో వేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతరత్రా పనులు చేపట్టడానికి అవకాశం లేకుండాపోతోంది. దీంతో రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని డ్రోన్ల ద్వారా వ్యవసాయ సహాయక పనులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆనందపురం మండలానికి ఆరు డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ముందుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆసక్తి గల ఐదుగురు రైతులు కలిసి కస్టమర్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేసుకోవాలి. అందులో ఐటీఐ లేదా ఇంటర్మీడియట్ చదివిన ఒకరిని పైలట్‌గా ఎన్నుకోవాలి. వారికి వ్యవసాయ శాఖ ద్వారా గుంటూరులో 15 రోజులపాటు శిక్షణ అందిస్తారు. డ్రోన్ కొనుగోలుకు గ్రూపు సభ్యులు 10 శాతం వాటా చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ రుణంతో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. ఆ డ్రోన్లతో పొలంలో పురుగు మందులు పిచికారీతోపాటు, విత్తనాలు, జల ఎరువులు కూడా చల్లడానికి వినియోగించుకోవచ్చు.

రైతులు అద్దె ప్రాతిపదికన ఇతర రైతులకు డ్రోన్ల సేవలు అందించవచ్చు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు ఎక్కువ విస్తీర్ణంలో చాలా తక్కువ సమయంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత గల వారిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామని తెలిపారు.

# గాయపడిన విద్యార్థులకు రూ.30 వేల సాయం



సాయం అందిస్తున్న రామరాజు దంపతులు

మధురవాడ: ఇటీవల మధురవాడ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన ఓ వ్యక్తి గురువారం సాయంత్రం ఆర్థిక సాయం అందించారు. డీవీ రామరాజు, సూర్యభాస్కరమ్మ దంపతులు ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, బి.మీనా, పి.సూరిబాబు, యన్.జ్యోతిష్, పీడీ రాము పాల్గొన్నారు.

# గ్రూపులుగా ఏర్పడితే రుణాలు మంజూరు



మాట్లాడుతున్న సహకార సంఘ అధికారి ప్రవీణ

పద్మనాభం: ఐదుగురు సభ్యులు ఓ గ్రూపుగా ఏర్పడితే సహకార సంఘాల ద్వారా రుణాలు ఇస్తామని జిల్లా సహకార సంఘ అధికారి కె.ప్రవీణ తెలిపారు. పద్మనాభం సచివాలయంలో గురువారం జేఎల్‌జీ గ్రూపుల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిరు వ్యాపారులు, రైతులు జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడాలని సూచించారు. గ్రూపు సభ్యులు వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసుకోవడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గా ప్రసాద్, సహకార సంఘ అధ్యక్షుడు ఎం.నారాయణరావు, కార్యదర్శి కనకల కోటీశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

# తుది దశకు కొత్త భవనం ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి నాగేశ్వరరావు

భీమునిపట్నం: భీమిలిలో సబ్ కోర్టు కోసం నూతన భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు తుది దశకు చేరుకున్నాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల న్యాయవాదుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నికకాగా గురువారం వారి పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పుడు కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యవర్గం ప్రతిపాదనలపై దృష్టి సారించి పయత్నిస్తే భవన నిర్మాణం త్వరగా పూర్తవుతుందన్నారు. జడ్జిలు సీహెచ్.పవన్‌కుమార్, జి.విజయలక్ష్మి, హైకోర్టు న్యాయవాది సార్వభౌమారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్.జనార్ధనరావు, కార్యదర్శి సూరిబాబు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జాగ్రత్తగా ఓటర్ల జాబితా పరిశీలన



మాట్లాడుతున్న ఓటర్ల నమోదు అధికారి భాస్కర రెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గం పరిధిలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఓటర్ల జాబితాలను జాగ్రత్తగా పరిశీలిస్తామని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి పేర్కొన్నారు. పలు రాజకీయ పార్టీల స్థానిక నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల్లో ఉన్న పేర్లు, వివరాలు పరిశీలిస్తారని పేర్కొన్నారు. వీరితోపాటు ఆయా రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు కూడా వెళ్లి జాబితాలు పరిశీలించి సరి చూసుకోవాలని కోరారు. చనిపోయిన వారి పేర్లు తొలగిస్తారని, కొత్త వారి పేర్లు నమోదు చేసుకుంటారన్నారు. దీనిపై ప్రతీ మంగళవారం బీఎల్‌వోలు, ఏజెంట్లు సమావేశం ఏర్పాటు చేసుకుని సమీక్షించుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఇంట్లోని వారు ఒకే పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేలా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, మైలిపల్లి షణ్ముఖరావు, కోరాడ రాజబాబు, గంటా నూకరాజు, పంచకర్ల సందీప్, చంద్రరావు, కదిరి జగన్నాథం, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, తహసీల్దార్ కె.వేణుగోపాల్, జోనల్ కార్యాలయ ఏసీపీ శ్రీనివాస్, ఎన్నికల డీటీ జె.భాస్కరరావు పాల్గొన్నారు.

# ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన అవసరం

కొమ్మాది: ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ న్యాయ నిపుణులు కావేటి శ్రీనివాసరావు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన కల్పించారు.

అమెరికా వంటి దేశాల్లో విద్య, ఉపాధి కోసం మధ్యవర్తులు, కొందరు ట్రావెల్ ఏజెంట్లు సూచించిన తప్పుడు మార్గాలు అనుసరించడం వల్ల పలువురు భారతీయులు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాలు అధికంగా ఉన్నాయని, సరైన పత్రాలు లేకుండా విదేశాల్లోకి ప్రవేశిస్తే వాటిని అక్రమ వలసలుగా పరిగణిస్తారని వెల్లడించారు. న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు, దేశంలోని న్యాయవాదులు ఇమిగ్రేషన్ చట్టాలపై అవగాహన పెంచుకుంటే భారతీయులకు సహాయ పడడంతోపాటు ఉపాధి మార్గంగా మలచుకోవచ్చని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# కషాయాలతో చీడపీడల నివారణ

పద్మనాభం: కషాయాలతో చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఎం.అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోరాడలో బ్రహ్మాస్త్రం, దశపర్ని కషాయం తయారీపై మహిళా రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రకాల ఆకులతో ఈ కషాయాలను తయారు చేసుకోవచ్చని సూచించారు రసం పీల్చే పురుగు, కాయలు, కాండం తొలిచే పురుగులను ఈ కషాయాల పిచికారీతో నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది జయరాం, కాంతారావు, వెంకట రమణ పాల్గొన్నారు.

# గడువులోగా జగనన్న ఇళ్ల నిర్మాణం

- పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో అర్హులకు కేటాయించిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించామని, నిర్మాణాలు చేపట్టుకోవాలని సూచించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, దానికి తగినట్టు సంబంధిత అధికారులు అన్ని ప్రాంతాల్లోనూ నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. అలాగే ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించే పనులు వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలని కోరారు. నారాయణరాజుపేట సర్పంచ్ కాద సూర్యనారాయణ, దాకమర్రి, టి.నగరపాలెం ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, పల్లా నీలిమ మాట్లాడుతూ తమ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలని కోరారు. ఎంపీపీ వాసురాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తెలియపరిచే సమస్యలు, పనులపై అధికారులు వెంటనే స్పందించి చేపట్టాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు.

**విగ్రహాలు ఆవిష్కరణ**

భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఇక్కడ గతంలో మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలు ఉండేవి. అవి పాడైపోవడంతో మరమ్మతులు చేయించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి మహనీయులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

### బయో మెడికల్ పరిశోధనలతో ఉజ్వల భవిత

కొమ్మాది: వైద్య రంగంలో మానవాళికి ఉపయోగపడే ఆధునిక బయో మెడికల్ ఉత్పత్తులను తయారు చేయడానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఈసీఈ విభాగం పరిశోధకులు దృష్టి సారించాలని, వాటికి ఉజ్వల భవిష్యత్ ఉందని వాషింగ్టన్ డీసీకి చెందిన జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీ పరిశోధకుడు డాక్టర్ కార్తీక్ వి.బులుసు పేర్కొన్నారు. గురువారం గీతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇంజినీరింగ్ పరిశోధకులు సైతం వైద్య రంగానికి అవసరమైన ఉపకరణాలు అందించవచ్చని తెలిపారు. బయో ఫ్లూయిడ్స్ పరిజ్ఞానం ఆధారంగా మానవ శరీరంలో రక్త ప్రసరణ, వివిధ సమస్యలను అధ్యయనం చేశామని తెలిపారు.

# చంద్రంపాలెం హైస్కూల్‌లో 878 మందికి అడ్మిషన్లు



తల్లిదండ్రులు, విద్యార్థులకు కౌన్సెలింగ్ చేస్తున్న హెచ్‌ఎమ్ రాజబాబు

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరంలో కొత్త అడ్మిషన్ల సంఖ్య 878కి చేరింది. ఇంకా అడ్మిషన్స్ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతోంది. దీంతో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఇక్కడి విద్యార్థుల సంఖ్య మొత్తం 3,730కి చేరింది. ఈ ఏడాది 4 వేల సంఖ్యను దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ హైస్కూల్‌లో సువిశాల పరిసరాలు, ఆట మైదానం, 65 వరకు తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు కంప్యూటర్, వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ నేషనల్ గ్రీన్ క్రాప్స్, బాల బాలికలకు ఎన్‌సీసీ బ్యాచ్‌లు కూడా ఉన్నాయి. దీంతో ఈ పాఠశాలలో ప్రైవేటు స్కూళ్ల నుంచి కూడా విద్యార్థులు వచ్చి చేరుతున్నారు. ఇంకా ఇక్కడ అడ్మిషన్స్ ప్రక్రియ సాగుతోందని, చేరాలనుకునే విద్యార్థులు సంప్రదించాలని ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజబాబు చెప్పారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



పీఎంపాలెంలో అనధికార పెంట్‌హౌస్‌ను ధ్వంసం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది గురువారం కూలగొట్టారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 37/1 స్వతంత్రనగర్ ఈడబ్ల్యూఎస్ లే అవుట్‌లో జీ ప్లస్ టూ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పోర్షన్ గోడలు పగలగొట్టారు. శివశక్తినగర్‌లో ప్లాన్ అప్రూవల్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన జీ ప్లస్ వన్ భవనాన్ని పాక్షికంగా కూలగొట్టారు. ఇందులో కింది ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన షట్టర్‌లు, గోడలు పగలగొట్టారు. అలాగే పీఎంపాలెం ఆడమ్స్ హాస్పిటల్ సమీపంలో జీ ప్లస్ టూ భవనంపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పెంట్ హౌస్ శ్లాబుని ధ్వంసం చేశారు. నిర్మాణదారులు నిబంధనలు పాటించాలని, ఉల్లంఘనలు సహించమని టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్ హెచ్చరించారు. పనులను టీపీఎస్ ఝాన్సీ పర్యవేక్షించారు.